సాక్షి వైఎస్ఆర్ జిల్లా

ఆదివారం । 16 । మార్చి । 2025



మత విద్వేషాలు రెచ్చగొడుతున్న బీజేపీ

భారతీయ జనతా పార్టీ మత విద్వేషాలు రెచ్చగొడుతూ ప్రజల మధ్య చిచ్చు పెడుతోందని పలు పార్టీలు, సంఘాల ప్రతినిధులు మండిపడ్డారు. -8లో

రంజాన్ వేళలు

	ఇఫ్తార్ ఆది॥ (సా॥)	సహర్ సోమ॥ (ఉ॥)
కడప	6.31	5.07
పులివెందుల	6.33	5.12
ప్రొద్దుటూరు	6.32	5.11

వాతావరణం

గరిష్టం/కనిష్టం 39.5/20.6

జిల్లాలో శనివారం 20.6 – 39.5 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. గంటకు 2.4 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.

- కడప అగ్రికల్చర్

న్యూస్‌రీల్

ఫిర్యాదుల పరిష్కారానికి కంట్రోల్ రూమ్ ఏర్పాటు

కడప ఎడ్యుకేషన్: పదవ తరగతి పబ్లిక్ పరీక్షలకు సంబంధించి ఎవరైనా తమ ఫిర్యాదులను తెలియజేసేందుకు, సమస్యల పరిష్కారానికి కంట్రోల్ రూంను ఏర్పాటు చేసి సిబ్బందిని నియమించినట్లు పాఠశాల విద్య ఆర్‌జేడీ కాగిత శ్యాముల్ తెలిపారు. ఇందులో ఆర్‌జేడీ కార్యాలయ సూపరింటెండెంట్ బాబానాయక్ (9441683500), జయసూర్య (7358302380)లను నియమించినట్లు తెలిపారు. ఏవైనా ఫిర్యాదులుంటే వీరి నంబర్లకు కాల్ చేసి తెలియ చేయవచ్చని ఆర్‌జేడీ తెలియ చేశారు.

రేపు 'స్పర్ష్ అవుట్ రీచ్' ప్రోగ్రాం

కడప రూరల్: కడపలోని జిల్లా సైనిక సంక్షేమ భవనం దగ్గర ఈ నెల 17వ తేదీన ఆంధ్రప్రదేశ్ ఎక్స్ సర్వీసెస్ లీగ్ ఆధ్వర్యంలో నిర్వహించే 'స్పర్ష్ అవుట్ రీచ్'ప్రోగ్రాంను జిల్లాలోని మాజీ సైనికులు వారి కుటుంబ సభ్యులు సద్వినియోగం చేసుకోవాలని లీగ్ జిల్లా అధ్యక్షులు జడ్ ఫిలిప్స్ తెలిపారు. ఈ సందర్భంగా స్పర్ష్, ఈసీహెచ్ఎస్, కేఎస్బీ, డిజేబులిటీ పెన్షన్‌తో పాటు ఇతర సమస్యలను పరిష్కరించనున్నట్లు పేర్కొన్నారు. ఈ నెల 17వ తేదీన ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు నిర్వహించే కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

రేపు 'ఎన్టీఆర్ వైద్య సేవ' సిబ్బంది విధుల బహిష్కరణ

కడప రూరల్: డాక్టర్ ఎన్టీఆర్ వైద్య సేవలో పని చేస్తున్న వైద్య మిత్రలు ఇతర సిబ్బంది తమ సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 17న కడపలోని జిల్లా కో ఆర్డినేటర్ కార్యాలయం ఎదుట విధులను బహిష్కరించి..నిరసన కార్యక్రమం చేపట్టనున్నట్లు జిల్లా యూనియన్ అధ్యక్షుడు సి. విజయ్, జాయింట్ సెక్రటరీ సుబ్బరాజు తెలిపారు. ఆందోళన కార్యక్రమాల్లో భాగంగా 24వ తేదీన కడపలోని జిల్లా కో-ఆర్డినేటర్ కార్యాలయం ఎదుట, 27వ తేదీన మంగళగిరిలోని డాక్టర్ ఎన్టీఆర్ వైద్య సేవ ట్రస్ట్ కార్యాలయం వద్ద శాంతియుత నిరసన..విధుల బహిష్కరణ కార్యక్రమాలను చేపడుతున్నట్లు పేర్కొన్నారు. తమ న్యాయమైన కోర్కెలను ప్రభుత్వం పరిష్కరించాలని తెలిపారు. సిబ్బంది ఈ కార్యక్రమాలను జయప్రదం చేయాలని కోరారు.

వైభవం.. పుష్పయాగం



స్వామివారికి పుష్పయాగం నిర్వహిస్తున్న అర్చకులు

గుర్రంకొండ: అన్నమయ్య జిల్లా గుర్రంకొండ మండలంలోని తరిగొండ గ్రామంలో వెలసిన శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో పుష్పయాగం వైభవంగా నిర్వహించారు. స్వామివారి బ్రహ్మోత్సవాల్లో భాగంగా చివరి రోజైన శనివారం ఉదయం తోమాలసేవ, పవిత్ర జలాలతో స్నపన తిరుమంజనం జరిపారు. అనంతరం సుదూర ప్రాంతాల నుంచి రంగురంగుల పుష్పాలను తెప్పించి గ్రామోత్సవం నిర్వహించారు. వాటితో స్వామివారిని అందంగా అలంకరించారు. అనంతరం వేద పండితుల మంత్రోచ్ఛారణల నడుమ పుష్పయాగం నిర్వహించారు. స్వామివారికి అలంకరించిన పుష్పాలను అర్చకులు భక్తులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో టీటీడీ అధికారులు, అర్చకులు, భక్తులు పాల్గొన్నారు.

ఏపీపీఎస్సీ పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలి



మాట్లాడుతున్న డీఆర్వో విశ్వేశ్వరనాయుడు


కడప సెవెన్‌రోడ్స్: ఈ నెల 16, 17 తేదీల్లో జరగనున్న ఏపీపీఎస్సీ ఫారెస్టు రేంజ్ ఆఫీసర్, జూనియర్ అసిస్టెంట్ ఇన్ డాక్టర్ ఎన్టీఆర్ హెల్త్ యూనివర్శిటీ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని డీఆర్వో విశ్వేశ్వరనాయుడు అధికారులను ఆదేశించారు. శనివారం తన చాంబర్‌లో ఆయన విలేకరులతో మాట్లాడారు. ఉదయం 9.30 మధ్యాహ్నం 12.00 గంటల వరకు , తిరిగి మధ్యాహ్నం 2.30 నుంచి 5.00 గంటల వరకు ఈ పరీక్షలు ఉంటాయన్నారు. పరీక్షా కేంద్రాల్లో ఎలాంటి మాల్ ప్రాక్టీస్‌కు అవకాశం లేకుండా చూడాలన్నారు. లైజన్ ఆఫీసర్లు, చీఫ్ సూపరింటెంట్లు, పోలీసు యంత్రాంగం సమన్వయంతో పనిచేసి పరీక్షలు సజావుగా జరిగేలా చూడాలన్నారు. జిల్లాలోని సీకే దిన్నె మండల పరిధిలో నాలుగు, చాపాడులో ఒకటి, ప్రొద్దుటూరులో ఒక కేంద్రం కలిపి మొత్తం ఆరు పరీక్షా కేంద్రాలు ఉంటాయని, ప్రతి కేంద్రం వద్ద పటిష్ట పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయాలన్నారు. ఏపీపీఎస్సీ పరీక్షల జిల్లా ప్రత్యేక అధికారులు ఎండీ బాబర్, ఎ.శివనారాయణరెడ్డి, లైజన్ ఆఫీసర్లు, చీఫ్ సూపరింటెండెంట్లు పాల్గొన్నారు.

పది పరీక్షలకు వేళాయె

- తుది అంకానికి పరీక్షల ఘట్టం
- పోలీసు స్టేషన్స్‌కు చేరుకున్న ప్రశ్నపత్రాలు
- ఈ నెల 17 నుంచి పరీక్షలు ప్రారంభం



పరీక్షలకు సిద్ధమవుతున్న విద్యార్థులు



కడప ఎడ్యుకేషన్: జిల్లావ్యాప్తంగా పదో తరగతి పరీక్షల ఏర్పాట్ల ఘట్టం తుది అంకానికి చేరుకుంది. జిల్లాలో ఈ నెల 17 నుంచి ప్రారంభమయ్యే పరీక్షల కోసం 161 కేంద్రాలు సిద్ధం చేయగా 27800 మంది పరీక్షలను రాయనున్నారు. ఈ పరీక్షల పర్యవేక్షణకు 161 మంది చీఫ్ సూపరింటెండెంట్లు, 161 మంది డిపార్టమెంట్ ఆఫీసర్లను నియమించారు. సంబంధిత పరీక్షలను ఉదయం 9.30 గంటల నుంచి 12.45 వరకు నిర్వహించనున్నారు.

ఇన్విజిలేటర్ల నియామకం పూర్తి...

పరీక్షల నిర్వహణలో ముఖ్యమైన ఇన్విజిలేటర్ల నియామకం కూడా పూర్తయింది. ఈ సారి పరీక్షల్లో స్కూల్ అసిస్టెంట్ల నియామకానికి ప్రాధాన్యమిచ్చారు. స్కూల్ అసిసెంట్లు సరిపోని పక్షంలో ఎస్‌జీటీలతోపాటు ఇతరుల నియామకాన్ని చేపట్టారు. సబ్జెక్టు టీచర్లను మాత్రం వారి పరీక్ష నిర్వహణ రోజు రిలీవ్ చేస్తారు. పరీక్షలకు సంబంధించి జిల్లాలో 1671 మంది ఇన్విజిలేటర్లను నియమించారు. ఇన్విజిలేటర్లుగా నియమితులైన ఎస్‌జీటీలను ఎంఈఓలు, స్కూల్ అసిస్టెంట్లను హెచ్ఎంలు రిలీవ్ చేయనున్నారు.

పోలీసు స్టేషన్లకు ప్రశ్నపత్రాలు...

పరీక్షలకు సంబంధించిన ప్రశ్నపత్రాలు ఆయా మండలాల్లోని పోలీసు స్టేషన్లకు చేరాయి. ఈ నెల 10,11 తేదీల్లో పదో తరగతి పబ్లిక్ పరీక్షల ప్రశ్నపత్రాలు జిల్లా కేంద్రమైన కడపకు చేరుకున్నాయి. 10వ తేదీన సెట్-1, 11వ తేదీన సెట్-2 ప్రశ్నపత్రాలు చేరుకోగా 12న సెట్-1, 13న సెట్-2 ప్రశ్నపత్రాలను కడప మున్సిపల్ హైస్కూల్ మొయిన్ నుంచి మండల కేంద్రాలలోని పోలీసు స్టేషన్లకు చేరాయి. కడపలో మాత్రం ఎస్‌టీఓ కార్యాలయంలో భద్ర పరిచారు. ఆయా పరీక్షా కేంద్రాల సీఎస్, డీఓలు వాటిని సబ్జెక్టు, తేదీల వారిగా విభజించుకుని వాటిని పోలీసు స్టేషన్లలో భద్రపర్చారు.

జిల్లాలో 6 సమస్య కేంద్రాలు గుర్తింపు...

జిల్లాలలో 6 పరీక్షా కేంద్రాలను సమస్యాత్మకంగా గుర్తించారు. కమలాపురం జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాల, బి.మఠం కంది మల్లాయపల్లె జెడ్పీ ఉన్నత పాఠశాల, బి.కోడూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాల, కొండాపురం జెడ్పీ ఉన్నత పాఠశాల, వేంపల్లి జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాల, సింహాద్రిపురం జెడ్పీ ఉన్నత పాఠశాలలను గుర్తించారు. ఈ సమస్యాత్మక కేంద్రాలలో సీసీ కెమెరాలను ఏర్పాటు చేయనున్నారు.

మెడికల్ కిట్లు సిద్ధం

పరీక్షా కేంద్రాలలో విద్యార్థులకు అనారోగ్య సమస్యలు తలెత్తితే వెంటనే వైద్య సేవలందేలా ఏర్పాటు చేశారు. పరీక్షా కేంద్రాల వద్ద అవసరమైన వైద్య సిబ్బందితోపాటు మందులను వైద్యశాఖ ఏర్పాటు చేసింది. పరీక్షా కేంద్రంలో ఏఎస్ఎంతోపాటు ఆశా వర్కర్‌ను నియమించి ప్రథమ చికిత్సకు అవసరమైన మందులు, ఓఆర్ఎస్ ప్యాకెట్లను అందుబాటులో ఉంచనున్నారు. పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలులో ఉంటుంది. పరీక్షా కేంద్రాలను నో సెల్‌ఫోన్ జోన్‌గా కూడా ప్రకటించారు.

పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి



పదో తరగతి పరీక్షలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశాం. ఇన్విజిలేటర్ల నియామకం పూర్తయ్యింది. ప్రశ్నపత్రాలను మండల కేంద్రాల్లోని ఆయా పోలీసు స్టేషన్లకు చేరవేశాం. విద్యార్థులు హాల్‌టికెట్, పెన్ తప్పని సరిగా తెచ్చుకోవాలి. నిర్ణయ సమయానికంటే ముందే పరీక్షా కేంద్రాలకు చేరుకోవాలి.

– షేక్ షంషుద్దీన్, జిల్లా విద్యాశాఖ అధికారి

విద్యార్థులకు సూచనలు

- పరీక్షలు రాసే విద్యార్థులంతా ఉదయం 8.30 గంటల కల్లా ఖచ్చితంగా పరీక్షా కేంద్రాలకు చేరుకోవాలి.
- ఉదయం 8.45 నుంచి 9.30 వరకు మాత్రమే విద్యార్థులను పరీక్షా కేంద్రాలలోకి అనుమతిస్తారు. ఆ తరువాత గేట్లు మూసి వేస్తారు.
- విద్యార్థులంతా హాల్ టికెటుపై ముద్రించిన తమ వివరాలు, పుట్టిన తేదీ, తల్లితండ్రుల పేర్లు, రాయాల్సిన సబ్జెక్టులు, పరీక్ష కేంద్రంపేరు, చిరునామా సరి చూసుకోవాలి.
- తప్పులుంటే ముందుగానే ప్రధానోపాధ్యాయుల ద్వారా ప్రభుత్వ పరీక్షల విభాగం దృష్టికి తీసుకెళ్లి సరి చేయించుకోవాలి
- రోల్ నెంబర్ ఆధారంగా విద్యార్థి తనకు కేటాయించిన సీట్లో కూర్చున్న తరువాత ఇన్విజిలేటర్ బార్ కోడింగ్ ఓఎంఆర్ షీట్ , ప్రశ్నపత్రం, అన్సర్ బుక్‌లేట్ అందజేస్తారు. తర్వాత ఓ ఎంఆర్ షీట్ పూరించే విధానంపై ఇన్విజిలేటర్ ఇచ్చే సూచనలు పాటిస్తూ జాగ్రత్తగా పాటించాలి. దానిపై అనవసరమైన గీతలు, రాతలు రాయకూడదు.
- ఇన్విజిలేటర్ ఇచ్చిన ఓఎంఆర్ షీట్‌పై విద్యార్థి పేరు, పరీక్షకు సంబంధించిన వివరాలు సక్రమంగా ఉన్నవీ, లేనివి నిర్ధారించుకోవాలి.
- 9.30 గంటలకు పరీక్ష ప్రారంభమైన తర్వాత మధ్యాహ్నం 12.45 గంటలకు పరీక్ష ముగిసే వరకు విద్యార్థులు బయటకు వెళ్లనివ్వరు.
- విద్యార్థులు ప్రశాంతంగా హాజరయ్యి పరీక్షలు రాయాలి.
- ప్రతి విద్యార్థికి 24 పేజీలతో కూడిన ఆన్సర్ బుక్‌లేట్ ఇస్తారు. అదనంగా పేపర్లు అవసరమైతే మరోక 12 పేజీల బుక్‌లెట్‌ను ఇస్తారు. విద్యార్థులకు ఇచ్చిన ఓఎంఆర్ షీట్, ఆన్సర్ బుక్‌లెట్‌లలో ఏ ఒక్క పేజీని చింపినా మాల్ ప్రాక్టీస్‌గా పరిగణించే అవకాశం ఉంటుంది. విద్యార్థులు అన్ని జాగ్రత్తలను తీసుకుని ఆందోళన లేకుండా పరీక్షలు రాయాలి.

ప్రశాంతంగా ముగిసిన ఇంటర్ పరీక్షలు



పరీక్ష ముగిసిన అనంతరం విజయ సంకేతం చూపిస్తున్న విద్యార్థినులు

కడప ఎడ్యుకేషన్: జిల్లావ్యాప్తంగా మార్చి 1 నుంచి ప్రారంభమైన ఇంటర్ ప్రథమ, ద్వితీయ సంవత్సర పరీక్షలు శనివారంతో ప్రశాంతంగా ముగిశాయి. ఈ పరీక్షల కోసం జిల్లా వ్యాప్తంగా 64 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు. ప్రథమ సంవత్సరానికి సంబంధించి 17114 మంది, సెకెండియర్‌కు సంబంధించి 15771 మంది విద్యార్థులు మొత్తంగా జనరల్, ఒకేషనల్‌కు సంబంధించి 32885 మంది విద్యార్థులు పరీక్షలను రాశారు. ఈ సందర్భంగా ఆర్ఐవో బండి వెంకటసుబ్బయ్య మాట్లాడుతూ ఎలాంటి ఆరోపణలకు తావు లేకుండా పరీక్షలను నిర్వహించామన్నారు. పరీక్షల నిర్వహణకు సహరించిన అన్నిశాఖలకు ఆయన ప్రత్యేక ధన్యవాదాలు తెలియచేశారు.

చివరి రోజు 544 మంది గైర్హాజరు...

ఇంటర్ పరీక్షల్లో భాగంగా చివరిరోజు ఇంటర్ ద్వితీయ సంవత్సర పరీక్షలకు కెమిస్ట్రీ, కామర్స్ పరీక్షలకు 14083 మంది విద్యార్థులకుగాను 13539 మంది హాజరుకాగా 544 మంది గైర్హాజరయ్యారని ఆర్ఐవో బండి వెంకటసుబ్బయ్య తెలిపారు.

ఖుషీ ఖుషీగా విద్యార్థులు

పరీక్షలు ముగియడంతో పిల్లలు ఖుషీ ఖుషీగా కనిపించారు. పరీక్ష ముగించుకుని బయటకు రాగానే కేరింతలు కొట్టారు. ఒకరికొకరు చేతులు కలుపుకోవడం.. సెండాఫ్ చేప్పుకోవడం వంటి సంబరాల్లో మునిగిపోయారు.

వినియోగదారుల హక్కులపై అవగాహన అవసరం

ది నేషనల్ కన్స్యూమర్ రైట్స్ నేషనల్ ఛైర్మన్ సాయి రమేష్



మీడియాతో మాట్లాడుతున్న ది నేషనల్ కన్స్యూమర్ రైట్స్ కమిషన్ సభ్యులు

కడప కార్పొరేషన్: వినియోగదారులు తమ హక్కులపై అవగాహన ఏర్పరుచుకోవాలని ది నేషనల్ కన్స్యూమర్ రైట్స్ నేషనల్ ఛైర్మన్ డాక్టర్ సాయి రమేష్ అన్నారు. శనివారం ప్రపంచ వినియోగదారుల దినోత్సవం సందర్భంగా కడప నగర శివార్లలోని ఉమెన్స్ పాలిటెక్నిక్ కాలేజీ ఎదురుగా ఉన్న పాస్టర్స్ సెంటర్ ఆడిటోరియంలో ది నేషనల్ కన్స్యూమర్ రైట్స్ కమిషన్ స్టేట్ కో-ఆర్డినేటర్ మద్దెల సురేష్ బాబు ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సాయి రమేష్ మాట్లాడుతూ వినియోగదారుల అవగాహనకు ది నేషనల్ కన్స్యూమర్ రైట్స్ కమిషన్ ద్వారా ప్రతి జిల్లాలో అవగాహన సదస్సులు ఏర్పాటు చేస్తున్నామని పేర్కొన్నారు. వినియోగదారులు మోసపోకుండా ఉండడానికి తమ వంతు కృషి చేస్తున్నామని తెలిపారు. వినియోగదారుడు కొనే ప్రతి వస్తువు పైన కొన్ని హక్కులు ఉంటాయని, ఆ విషయాన్ని ప్రజలు తెలుసుకోవాలని సూచించారు. ఆరోగ్యవంతమైన న్యాయమైన, స్థిరమైన జీవితం వైపు ముందడుగు వేయాలన్నారు. మోసపూరిత చర్యలు లేకుండా ముందుకు సాగాలని, సైబర్ క్రైమ్ కు దూరంగా ఉండాలని వివరించారు. సర్కిల్ ఇన్స్పెక్టర్ సీతారాం మాట్లాడుతూ ఇటీవల పెరుగుతున్న ఆన్‌లైన్ మోసాల పట్ల ప్రజల అప్రమత్తం కావాలన్నారు. సైబర్ క్రైమ్ వలలో చిక్కకుండా జాగ్రత్తలు వహించాలని సూచించారు. ఏపీ స్టేట్ ఛైర్మన్ శ్రీనివాస యాదవ్ మాట్లాడుతూ కొనే ప్రతి వస్తువుపై బిల్లు తీసుకోవాలని వినియోగదారుల్లో ఏమైనా సమస్యలు ఉంటే నేరుగా దీని నేషనల్ కన్స్యూమర్ రైట్స్ కమిషన్ ని సంప్రదిస్తే తమ వంతు సహాయం చేస్తామన్నారు. స్టేట్ వైస్ ఛైర్మన్ మత్సు విశ్వనాథం , డాక్టర్ నల్లమిల్లి ఆది రెడ్డి, తెలంగాణ స్టేట్ వైస్ ఛైర్మన్ మెరుగు రాధాక్రిష్ణ గౌడ్, అనకాపల్లి జిల్లా ఛైర్మన్ హేమంత్ చరపాక, కడప జిల్లా ఛైర్మన్ కిషోర్, ఛైర్మన్ అడ్మిన్ చైతన్య, కడప జిల్లా సంస్థ సభ్యులు పాల్గొన్నారు.

పరిసరాల శుభ్రతతో ఆరోగ్యం

ఎస్పీ ఈ.జీ అశోక్‌కుమార్



కడపలోని పోలీస్ కార్యాలయం వద్ద మొక్కను నాటుతున్న ఎస్పీ ఈ.జీ అశోక్‌కుమార్

కడప అర్బన్: ప్రతి ఒక్కరూ తమ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం సామాజిక బాధ్యత అని, పరిసరాల శుభ్రతతో ఆరోగ్యంగా ఉంటూ దైనందిన విధులను మరింత సమర్థవంతంగా నిర్వర్తించవచ్చని ఎస్పీ ఈ.జీ అశోక్‌కుమార్ పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతి మూడో శనివారం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన 'స్వర్ణాంధ్ర – స్వచ్ఛ ఆంధ్ర' కార్యక్రమంలో భాగంగా జిల్లా పోలీసు కార్యాలయం వద్ద ఉన్న స్టేడియం పరిసరాలను ఎస్పీ పాల్గొని పారలు, గునపం చేతబట్టి స్వయంగా శుభ్రపరిచారు. అనంతరం మొక్క నాటారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ పోలీసులు క్రమశిక్షణతో ఇటువంటి కార్యక్రమాల్లో పాల్గొనడం ద్వారా అందరికి స్ఫూర్తి కలిగిస్తుందనీ, సమాజ అభివృద్ధికి ప్రతి ఒక్కరూ భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు. ఏ.ఆర్. అదనపు ఎస్పీ బి. రమణయ్య, ఏ.ఆర్. డిఎస్పీ కె. శ్రీనివాసరావు, ఆర్ఐలు ఆనంద్, టైటస్, శివరాముడు, శ్రీశైలరెడ్డి, వీరేష్, ఆర్.ఎస్.ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

సర్పంచులపై కూటమి కక్ష

- చెక్ పవర్ రద్దుతో వేధింపులు
- నేతల కనుసన్నల్లో అధికారులు
- న్యాయస్థానాలను ఆశ్రయిస్తున్న బాధితులు






డీపీఓ కార్యాలయం వద్ద నిరసన తెలియజేస్తున్న సర్పంచ్ అనూరాధ (ఫైల్)

కడప సెవెన్‌రోడ్స్: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి చెందిన సర్పంచులపై అధికార ఎన్డీయే కూటమి ప్రజా ప్రతినిధుల కక్ష సాధింపు చర్యలు రోజురోజుకు అధికమవుతున్నాయి. అధికారాన్ని అడ్డుపెట్టుకుని సర్పంచుల చెక్‌పవర్ రద్దు చేయించడం ద్వారా వేధింపులకు పాల్పడుతున్నారు. అధికారులు కూడా టీడీపీ నేతల ప్రాపకం కోసం చెప్పిన దానికంతా తలాడిస్తున్నారు. జిల్లా పంచాయతీ అధికారి రాజ్యలక్ష్మి అనుసరిస్తున్న తీరు వివాదాస్పదంగా మారింది. దీంతో చేసేదిలేక బాధిత సర్పంచులు న్యాయ స్థానాలను ఆశ్రయించాల్సి వస్తోంది.

- ఖాజీపేట మండలం రావులపల్లె గ్రామ పంచాయతీ సర్పంచ్ పి.శివరామిరెడ్డి చెక్ పవర్‌ను రద్దు చేస్తూ జిల్లా పంచాయతీ అధికారి రాజ్యలక్ష్మి ఈనెల 10వ తేది ఉత్తర్వులు జారీ చేశారు. గ్రామ పంచాయతీ సాధారణ నిధులు, 15వ ఆర్థిక సంఘం నిధులను దుర్వినియోగం చేశారని సర్పంచ్‌పై అధికార పార్టీకి చెందిన కొందరు అభియోగాలు మోపారు. ఫిర్యాదులు వచ్చిందే తడువుగా స్పందించిన డీపీఓ రాజ్యలక్ష్మి విచారణ జరిపి తనకు నివేదిక సమర్పించాలంటూ కడప డివిజనల్ పంచాయతీ అధికారిని ఆదేశించారు. 2022–23, 2023–24 సంవత్సరాలకు సంబంధించిన గ్రామ పంచాయతీ సాధారణ నిధులు రూ. 1,78,924, 2023–24లో 15వ ఆర్థిక సంఘం నిధులు రూ. 46,652 కలిపి మొత్తం రూ. 2,25,576 నిబంధనలు పాటించకుండా వివిధ పనుల కోసం గ్రామ పంచాయతీ ఖర్చు చేసిందంటూ విచారణ అధికారి తన నివేదికలో పేర్కొన్నారు. నిబంధనలు పాటించలేదని చెప్పారే తప్ప, ఆ నిధులు దుర్వినియోగం చేసినట్లు నివేదికలో ఎక్కడా చెప్పలేదు. పనులకు చెల్లించిన నిధుల వివరాలు ఎం.బుక్కులో నమోదు చేశారుగానీ అంచనా వివరాలు లేవని విచారణ అధికారి తన నివేదికలో చెప్పడం సరికాదని పలువురు అంటున్నారు. ఎందుకంటే పనులకు సంబంధించిన అంచనా పత్రాలు రికార్డు కస్టోడియన్ అయిన పంచాయతీ కార్యదర్శి ఆధీనంలో ఉంటాయి. ఇక కోవిడ్ సమయంలో పారిశుద్ధ్యం, ప్రజారోగ్య పరిరక్షణ కోసం ఎక్కువ ఖర్చు చేయక తప్పలేదని సర్పంచ్ శివరామిరెడ్డి అంటున్నారు. వీఎల్‌సీ సరఫరా చేసిన ప్రతి వస్తువుకు సంబంధించిన బిల్లులను సర్పంచ్ విచారణ అధికారికి సమర్పించారు. కొనుగోలు చేసిన ప్రతి దాన్ని స్టాకు రిజిష్టర్‌లో నమోదు చేసి నిర్వహించే బాధ్యత ప్రభుత్వ నిబంధనల మేరకు పంచాయతీ కార్యదర్శిపై ఉంటుందేగానీ సర్పంచుపై కాదు. పంచాయతీ కార్యదర్శి/విస్తరణ అధికారి ఖర్చులకు సంబంధించిన బిల్లులను ప్రవేశ పెడితేనే పంచాయతీ ఆమోదిస్తుంది. నిజానికి పంచాయతీ విస్తరణ అధికారి తన పరిధిలోని పంచాయతీలను ప్రతినెలా సందర్శించి జమా ఖర్చులను తనిఖీ చేయాలి. పంచాయతీ పాలనలో ఏవైనా లోపాలుంటే సర్పంచుకు, సిబ్బందికి తగు సూచనలు ఇవ్వాల్సి ఉంటుంది. కానీ ఇప్పటివరకు తనిఖీలు నిర్వహించి లోపాలు లేకుండా చూసేందుకు ఏ అధికారి రావులపల్లె పంచాయతీ సందర్శించలేదని తెలుస్తోంది. సర్పంచ్ అన్ని వివరాలను డీపీఓకు సమర్పించినప్పటికీ వాటిని పట్టించుకోకుండా టీడీపీ నేతల ఒత్తిళ్లకు లొంగి చెక్‌పవర్ రద్దు చేశారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

- గతంలో వీరపునాయునిపల్లె మండలం బుసిరెడ్డిపల్లె పంచాయతీ సర్పంచ్ లింగారెడ్డి అనూరాధ చెక్ పవర్ రద్దుకు చర్యలు చేపట్టారు. సర్పంచ్ అనూరాధ బుసిరెడ్డిపల్లె నుంచి గంగనపల్లె రూ. 1.14 లక్షలతో గ్రావెల్‌రోడ్డు నిర్మించారు. ఏఈ సర్టిఫికెట్ కూడా ఇచ్చారు. బిల్లు అప్పటికి ఇంకా తీసుకోలేదు. కాగా రోడ్డు పనుల్లో అవినీతి జరిగిదంటూ టీడీపీ నాయకులు ఫిర్యాదు చేయడంతో డీపీఓ రాజ్యలక్ష్మి పులివెందుల డివిజనల్ పంచాయతీ అధికారిని విచారణకు నియమించారు. దీనిపై సర్పంచ్ గతనెల 19వ తేదిన జిల్లా పంచాయతీ అధికారి కార్యాలయం వద్ద నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఇలా అధికార పార్టీ నేతల ఫిర్యాదులకు విలువనిస్తూ వైఎస్సార్ సీపీకి చెందిన సర్పంచులను డీపీఓ వేధిస్తుండడం వివాదాస్పదంగా మారింది.

ముక్తసరి జవాబుతో సరిపెట్టిన డీపీఓ



రాజ్యలక్ష్మి, డీపీఓ

ఖాజీపేట మండలం రావుపల్లె గ్రామ సర్పంచ్ శివరామిరెడ్డి చెక్ పవర్ రద్దు వెనుక మీపై ఉన్న రాజకీయ ఒత్తిళ్లే కారణమని తెలుస్తోంది. ఇందుకు మీ సమాధానం ఏమిటని శనివారం డీపీఓ రాజ్యలక్ష్మిని 'సాక్షి' వివరణ కోరింది. ఇందుకు ఆమె బదులిస్తూ తనపై ఎలాంటి రాజకీయ ఒత్తిళ్లు లేవని, కడప డీఎల్‌పీఓ సమర్పించిన విచారణ నివేదిక ఆధారంగానే తాను చెక్ పవర్‌రద్దు చేశానని చెప్పారు. డీఎల్‌పీఓ నివేదికలో నిబంధనలు పాటించలేదని మాత్రమే ఉంది తప్ప నిధుల దుర్వినియోగం అనే మాట ఎక్కడా లేదని ప్రశ్నించగా ఆమె నీళ్లు నమిలారు. తాను వేరే సమావేశంలో ఉన్నానంటూ ఫోన్ కట్ చేయడం గమనార్హం.

ఘనంగా ముగిసిన దర్గా ఉత్సవాలు



బాబా సమాధుల వద్ద భక్తుల సందడి

రామాపురం: మండలంలోని నీలకంఠ్రావుపేట సమీపంలోని దర్గా వద్ద శ్రీ సద్గురు హజరత్ దర్బార్ అలీషావలి, రమతుల్లా అల్లైబాబా శ్రీ జలీల్ మస్తాన్ వలీ బాబా ఉరుసు ఉత్సవాలు శనివారం ఘనంగా ముగిశాయి. గురువారం గంధంతో ప్రారంభమైన ఉరుసుకు రాయలసీమ జిల్లాల నుంచే కాకుండా ఇతర రాష్ట్రాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. గతంలో దర్గా స్వామిజీ, దర్గా మాతాజీలు ఈ ఉరుసు ఉత్సవాలను జరిపేవారు. వారు పరమపదించడంతో సత్యమయ్య స్వామిజీ, శంకరయ్య స్వామిజీలు నిర్వహిస్తున్నారు. మూడు రోజుల పాటు జరిగిన ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం రాత్రి బెంగళూరుకు చెందిన ఆస్మానిఖత్, నాగపూర్‌కు చెందిన సలీం సైదా మధ్య గొప్ప ఖవాలీ పోటీ జరిగింది. అంతకు ముందు జెండా ఊరేగింపు జరిగింది. చుట్టుపక్కల గ్రామాల నుంచి 70–80 అడుగులు పొడవు కలిగిన వెదురు బొంగుతో దర్గాకు చేరుకొని తమ మొక్కులు తీర్చుకున్నారు. శనివారం రాత్రి రాష్ట్ర రవాణా, యువజన, క్రీడల శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. చదివింపులు, చాదర్‌తో దర్గాలో ఫాతేహా నిర్వహించారు.



డప్పువాయిద్యాల నడుమ జెండా మెరవణి

క్లుప్తంగా

గ్రావెల్ తరలిస్తున్న వాహనాలు సీజ్



తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో ఉంచిన సీజ్ చేసిన వాహనాలు

కడప కోటిరెడ్డిసర్కిల్ : కడప నగర శివారులోని చిన్నచౌక్ గ్రామ సర్వే నెంబర్ 919లో అక్రమంగా గ్రావెల్ తరలిస్తున్న వాహనాలను రెవెన్యూ అధికారులు పట్టుకున్నారు. రెండు టిప్పర్లు, ఒక ట్రాక్టర్ నిబంధనలకు విరుద్ధంగా గ్రావెల్ తరలిస్తుండగా సీజ్ చేశారు. పట్టుబడిన వాహనాలను కడప నగరంలోని తహసీల్దార్ కార్యాలయానికి తరలించారు.

కేసులతో వేధించడం సరికాదు

కడప అర్బన్ : ఎక్కడైనా రెండు వర్గాల మధ్య సమస్యలు ఉన్నప్పుడు శాంతియుతంగా ఆ సమస్యను పరిష్కరించాల్సిందిపోయి ఒకే వర్గాన్ని లక్ష్యంగా చేసుకుని విపరీతమైన సెక్షన్లతో కేసులు పెట్టి వేధించడం అనేది చాలా దారుణమని భారత చైతన్య యువజన పార్టీ అధ్యక్షుడు రామచంద్ర యాదవ్ అన్నారు. ఇటీవల రాయచోటిలో జరిగిన సంఘటనకు సంబంధించి అక్రమ కేసుల ద్వారా రిమాండ్‌లో ఉన్న బాధితులను శనివారం ఆయన కడప కేంద్ర కారాగారానికి వచ్చి పరామర్శించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. రాష్ట్ర ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి, బీజేపీ నేతలు ఇలాంటి ఘటనలపై స్పందించాలని, భవిష్యత్తులో ఇలాంటి సంఘటనలు జరగకుండా జాగ్రత్తపడాలన్నారు.

ఎర్రగుంట్లలో చోరీ



బీరువాను పగలగొట్టిన దృశ్యం

ఎర్రగుంట్ల : ఎర్రగుంట్ల నగర పంచాయతీ పరిధిలోని వినాయకనగర్ కాలనీలో అబ్దుల్ సత్తార్ ఇంటిలో చోరీ జరిగింది. విషయం తెలుసుకున్న పట్టణ సీఐ నరేష్‌కుమార్ శనివారం ఉదయం సంఘటన స్థలాన్ని పరిశీలించారు. క్లూస్‌టీం వచ్చి సంఘటన స్థలంలో వేలి ముద్రలు సేకరించారు. బాధితుతు తెలిపిన వివరాలకు మేరకు ...అబ్దుల్ సత్తార్ రెండు రోజుల క్రితం తన కూతురు వద్దకు వెళ్లి తిరిగి ఇంటికి వచ్చి చూడగా తాళాలు పగలగొట్టి ఉన్నాయి. వెంటనే లోనికి వెళ్లి చూడగా బీరువాలో ఉన్న రెండు జతల కమ్మలు, వెండి పట్టీలు, గజ్జెలు చోరీకి గురైనట్లు గుర్తించాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ నరేష్‌కుమార్ తెలిపారు.

క్షయ నియంత్రణ పేరుతో.. కోట్లు మింగేశారు!

- ప్రభుత్వ నిధులకు కన్నం
- ఉద్యోగుల చేతి వాటం
- ఉన్నతాధికారుల దృష్టికి అవినీతి బాగోతం

కడప రూరల్ : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు క్షయ నియంత్రణకు పెద్ద ఎత్తున నిధులను కేటాయిస్తున్నాయి. అయితే ఈ నిధులు కొంతమంది అవినీతి పరులైన ఉద్యోగుల వలన పక్కదారి పడుతున్నాయి. జిల్లా వైద్య ఆరోగ్య శాఖలో జిల్లా క్షయ నియంత్రణ విభాగం ఒకటి. ఈ కార్యాలయం కడప ప్రభుత్వ సర్వజన ఆసుపత్రిలో ఉంది.

అవినీతి జరిగింది ఇలా...

క్షయ వ్యాధిని నియంత్రించేందుకు జిల్లా క్షయ నియంత్రణ విభాగానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఏటా రూ.కోట్ల నిధులను కేటాయిస్తాయి. ఈ నిధులను క్షయ నియంత్రణకు సంబంధించిన అంశాలకు ఖర్చు చేయాలి. అయితే 2019 నుంచి 2025 ఏడాదిలో ఇప్పటి వరకు ఆ విభాగంలో పనిచేసే కొందరు ఉద్యోగులు నిధులను పక్కదారి పట్టించారు.

- ఎన్‌పీవై (నిక్షయ్ పోషణ యోజన) స్కీం కింద టీబీ పేషెంట్ల పౌష్టికాహారానికి సంబంధించి ప్రభుత్వం ఒకరికి ఒక నెలకు రూ.500 చొప్పున 6 నెలల కాలానికి రూ.3 వేలు అందజేస్తుంది. అలాగే క్షేత్ర స్థాయిలో పేషెంట్ ఆరోగ్య పరిరక్షణ, పర్యవేక్షణ బాధ్యతలను 'ట్రీట్‌మెంట్ సపోర్టర్స్'గా ఆశాలు నిర్వహిస్తారు. ఈ ఆశాలకు కూడా ఒక పేషెంట్‌కు ఆరు నెలల కాలానికి రూ.3 వేలు వారి ఖాతాలకు జమ చేస్తారు. వ్యాధిగ్రస్తులకు డీబీటీ (డైరెక్ట్ బెనిఫిషరీ ట్రాన్స్‌ఫర్) ద్వారా రూ.3 వేలు అందిస్తారు. ఈ నిధులకు సంబంధించి అక్కడ పనిచేసే ఉద్యోగులు అకౌంట్ నంబర్లను మార్చి తమకు అనుకూలమైన అకౌంట్లకు నిధులను జమ చేశారు. ట్రీట్‌మెంట్ సపోర్టర్స్‌కు ఇవ్వవలసిన డబ్బులను పీఎఫ్ఎంఎస్‌లో అకౌంట్లు, ఐఎఫ్ఎస్‌సీ కోడ్స్‌ను మార్పు చేసి అక్కడ పనిచేసే ఉద్యోగి తనకు సంబంధించిన వారి అనధికారిక ఖాతాలకు దాదాపు రూ.12 లక్షలు దారి మళ్లించారు. ఇందుకు సంబంధించి నోట్ ఫైల్, పీఎఫ్ఎంఎస్ నుంచి పంపిన అకౌంట్స్ వివరాలు, ట్రీట్‌మెంట్ సపోర్టర్స్ వివరాలను పరిశీలించాలి.
- జిల్లాలో 40 మంది టీబీ ఫీల్డ్ స్టాఫ్ ఉన్నారు. వారందరికీ పీఓఎల్ (పెట్రోల్ బిల్లులు) చెల్లించాలి. ఒకరికి ఒక నెలకు రూ.3500 వరకు వస్తుంది. ఈ బిల్లులను 5–6 నెలలకు ఒక సారి చెల్లిస్తారు. అందుకు గాను ఒకరి నుంచి రూ.2 వేలు వసూలు చేస్తారు. ఎందుకని అడిగితే జిల్లా అధికారులకు ఇవ్వాలని సమాధానం ఇస్తారు. అలాగే ఫీల్డ్ స్టాఫ్ మాత్రమే ఉపయోగించాల్సిన టూ వీలర్స్‌ను అక్కడ పనిచేసే ఉద్యోగి తన వాళ్లకు ఇచ్చారు. కొన్ని టూ వీలర్స్‌ను నిబంధనలకు విరుద్ధంగా అక్కడ పని చేసే ఉద్యోగే ఉపయోగిస్తున్నారు.
- ఈ పెట్రోల్ బిల్లులకు సంబంధించి అక్కడ పని చేసే ఉద్యోగులు తమకు అనుకూలమైన ఎస్టీఎస్ (సీనియర్ ట్రీట్‌మెంట్ సూపర్‌వైజర్), టీబీహెచ్ఎస్ (ఫీల్డ్ స్టాఫ్) ఎంపీహెచ్ఎస్‌లకు అధిక మొత్తంలో బిల్లులను మంజూరు చేస్తారు. అందుకు సంబంధించిన డబ్బును ఆ ఉద్యోగుల నుంచి వసూలు చేస్తారు. ఆ విధంగా వచ్చిన డబ్బును తమ ఖాతాల్లో వేసుకోకుండా అనుకూలమైన అక్కడే పనిచేసే ఉద్యోగులతో పాటు కుటుంబ సభ్యుల ఖాతాల్లో జమ చేశారు. ఈ ఖాతాలను పరిశీలిస్తే ఆ వివరాలు తెలుస్తాయి.
- టీబీ డ్రగ్స్‌కు సంబంధించి తప్పుడు బిల్లులను పొందుపరిచారు. ఈ డ్రగ్స్‌కు సంబంధించిన నోట్ ఫైల్‌తో పాటు డ్రగ్ బిల్స్, పీఎఫ్ఎంఎస్ నుంచి ఆ నగదును ఏ అకౌంట్, ఐఎఫ్ఎస్సీ కోడ్స్‌కు బదిలీ చేశారో పరిశీలించాలి.

ఉన్నతాధికారులకు ఫిర్యాదులు..

ఆ శాఖలో అవినీతికి పాల్పడుతున్న ఉద్యోగులపై ఈ నెల 12వ తేదీన ఓ వ్యక్తి రూ.5 కోట్ల వరకు అవినీతి జరిగిందని ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు .రాష్ట్ర ఆరోగ్య శాఖ మంత్రి, విజయవాడ అవినీతి నిరోధక శాఖ, ఇంటెలిజెన్స్ అడిషనల్ డీజీపీ,



జిల్లా క్షయ నియంత్రణ విభాగం

ఆరోగ్య శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ, రాష్ట్ర టీబీ నియంత్రణ అధికారితో పాలు జిల్లా కలెక్టర్ శ్రీధర్ చెరుకూరికి ఫిర్యాదు చేశారు. దీంతో ఈ అంశం ఆ శాఖలో తీవ్ర చర్చనీయాంశంగా మారింది. కాగా ఇందుకు సంబంధించి వైద్య ఆరోగ్య శాఖ కమిషనర్ వీరపాండ్యన్ సమగ్ర విచారణ చేపట్టాలని రాష్ట్ర క్షయ నివారణ అధికారి డాక్టర్ రమేష్‌బాబును ఆదేశించారు. అలాగే జిల్లా కలెక్టర్ శ్రీధర్ చెరూకురి విచారణకు ఆదేశించినట్లుగా సమాచారం.

విచారిస్తే వాస్తవాలు వెలుగు చూస్తాయి..

ఈ అంశానికి సంబంధించి ఇప్పటికే ఆ శాఖలో ఉద్యోగుల మధ్య తీవ్ర చర్చజరుగుతోంది. అవినీతి సొమ్ముతో ఉద్యోగులు తమ సొంత పనులను చక్కబెట్టుకుంటున్నారని అనుకుంటున్నారు. అక్రమ సంపాదనలో ఏ అధికారికి ఎంత వాటా ఉంది. దీని వెనుక ఏ అధికారి ప్రమేయం..హస్తం ఉంది అనే అంశాలు వెలుగు చూడాల్సి ఉంది. కాగా ఫిర్యాదుదారుడు చాలా వరకు ఆధారాలతో సహా ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. ఆ అంశాలపై నిజాయితీగా లోతైన సమగ్ర దర్యాప్తు చేపట్టాలి. అప్పుడే వచ్చిన ఆరోపణలు వాస్తవమా..అవాస్తవమా అనేది తేలుతుందని ఉద్యోగులు అంటున్నారు.

విచారణకు డీఎంహెచ్ఓను ఆదేశించాం...

> క్షయ నియంత్రణ విభాగంలో అక్రమాలు జరిగాయని ఆరోపణలు వచ్చిన మాట వాస్తవం. ఈ ఆరోపణలపై సమగ్ర విచారణ జరపాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ నాగరాజును ఆదేశించాం. విచారణ చేపట్టిన తరువాత అందుకు సంబంధించిన నివేదికను తెప్పించుకొని పరిశీలించి, చర్యలు చేపడతాం.
>
> – డాక్టర్ రమేష్‌బాబు, రాష్ట్ర క్షయ నియంత్రణ అధికారి, జాయింట్ డైరెక్టర్

'కాశినాయన'పై దాడికి సీమపై వివక్షే కారణమా ?

కడప కల్చరల్ : కాశినాయన ఆశ్రమంపై దాడి చేసి అటవీ అధికారులు అక్కడి కొన్ని ముఖ్యమైన భవనాలను కూల్చివేయడానికి అధికారులు, రాజకీయ నాయకుల్లో రాయలసీమపైగల వివక్షే కారణమా అని రాయలసీమ ఆకాంక్షల పౌర వేదిక కోఆర్డినేటర్ అలవలపాటి రఘునాథరెడ్డి అన్నారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ కన్నబిడ్డలు అన్నం పెట్టకపోయినా ఆశ్రమంలో ఎప్పటికీ అన్నం లభిస్తుందని కాశినాయన ఆశ్రమానికి రోజూ వందలాది మంది అనాథలు చేరుకుంటారన్నారు. కుల మత గోత్రాలను పట్టించుకోకుండా అన్నార్తులను ఆదుకుంటున్న ఇలాంటి ఆశ్రమాలకు సాయం అందించాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై ఉంటుందన్నారు. ఈ కూల్చివేతకు అటవీ నిబంధనలు ప్రధాన కారణం కాదన్నారు. కూల్చివేత సమయంలో ఉండిన స్థితిని పునరుద్ధరించాలని, అందుకు ప్రభుత్వమే బాధ్యత తీసుకోవాలన్నారు.

ఏపీజీబీ విషయంలో కూడా..

కాశినాయన ఆశ్రమం విషయంలో స్పందించినట్లే ఏపీజీబీ విషయంలో కూడా రాష్ట్ర మంత్రి లోకేష్ సరైన రీతిలో స్పందించి ఇకనైనా దిద్దుబాటు చర్యలు చేపట్టాలని వేదిక కో ఆర్డినేటర్ రఘునాథరెడ్డి కోరారు. రాష్ట్రంలో 4 గ్రామీణ బ్యాంకుల విలీనం తర్వాత పెద్ద బ్యాంక్ అయిన ఏపీజీబీ ప్రధాన కార్యాలయం ఉన్న కడపలోనే రాష్ట్ర స్థాయి ప్రధాన కార్యాలయం కొనసాగాలని ఈ ప్రాంతంలో రాజకీయ అనుబంధాలకు అతీతంగా అందరూ కోరుకుంటున్నారని ఆయన అన్నారు.

ఓపెన్ స్కూలు కో ఆర్డినేటర్ అక్రమాలపై విచారణ జరపాలి

కడప సెవెన్‌రోడ్స్ : ఓపెన్ స్కూలు కో ఆర్డినేటర్ సాంబశివారెడ్డి అవినీతిపై విచారణ జరపాలని ఆర్ఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు డీఎం ఓబులేశు యాదవ్ కోరారు. శనివారం కలెక్టరేట్ సభా భవనంలో రీజినల్ జాయింట్ డైరెక్టర్ ఆఫ్ స్కూలు ఎడ్యుకేషన్ కె.శ్యామూల్‌కు వినతిపత్రం సమర్పించారు. సాంబశివారెడ్డికి అర్హత లేకపోయినా ఓపెన్ స్కూలు కో ఆర్డినేటర్‌గా అప్పటి డీఈఓ అనూరాధ నియమించారన్నారు. సుమారు ఆరు వేల మంది ఓపెన్ ఇంటర్ పరీక్షలు రాశారని, ఒక్కొక్కరి వద్ద రూ. 5–8 వేలు సాంబశివారెడ్డి వసూలు చేశారని ఆరోపించారు. ఇలా రూ. 6 కోట్లు అక్రమంగా వసూలు చేసిన ఆయనపై చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్ఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు నవీన్, నాయకులు నాగమల్లయ్య, అశోక్, సూర్యవంశీ, నాగార్జున, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

పర్యవేక్షణ లోపమే విద్యార్థిని ఆత్మహత్యకు కారణం

పోలీసుల విచారణలో వెలుగు చూసిన వాస్తవాలు

జమ్మలమడుగు : హాస్టల్ వార్డన్ ప్రభావతి, అక్కడ వంట మనిషిగా పని చేస్తున్న ప్రసన్నల వికృత చేష్టలే డిగ్రీ మొదటి సంవత్సరం చదువుతున్న అక్షిత (18) మరణానికి ప్రధాన కారణమని పోలీసుల విచారణలో తేటతెల్లమైంది. దీంతో వార్డన్ ప్రభావతిని సస్పెండ్ చేయగా వంట మనిషిగా ఉన్న ప్రసన్నను అవుట్ సోర్సింగ్ ఉద్యోగం నుంచి తొలగిస్తూ ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు.

గతంలోనూ ఆత్మహత్యకు యత్నించిన విద్యార్థినులు..

గత ఏడాది నవంబర్‌లో ఓ ప్రైవేట్ కాలేజీలో డిగ్రీ మొదటి, రెండో సంవత్సరం చెదువుతున్న విద్యార్థినులు ఆత్మహత్యా యత్నానికి పాల్పడ్డారు. అప్పట్లో అధికారులు వారి వ్యక్తిగత కారణాల వల్ల ఆత్మహత్యలకు యత్నించినట్లు తప్పుడు నివేదిక ఇవ్వడం వల్లే తిరిగి ఇలాంటి సంఘటన జరిగిందని విద్యార్థి సంఘాలు ఆరోపిస్తున్నాయి. హాస్టల్ వార్డన్, వంట మనిషి వసతి గృహంలో ఉంటున్న



అక్షిత మరణానికి కారణమైన వసతి గృహం

విద్యార్థినులను తమ స్వలాభాలకు ఉపయోగించుకుంటున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. వంట మనిషి ఆడపిల్లలను అర్ధరాత్రి పూట బయటకు పంపిస్తోందని స్థానికులు చెప్పినా వార్డన్ పట్టించుకోలేదనే విమర్శలు వినవస్తున్నాయి.

అక్షిత కుటుంబానికి న్యాయం చేయాలి

ఆత్మహత్య చేసుకున్న అక్షిత కుటుంబానికి ప్రభుత్వం న్యాయం చేయాలంటూ ప్రజా సంఘాలు, విద్యార్థి, యువజన సంఘాల నాయకులు డిమాండ్ చేస్తున్నారు. గతంలో తప్పుడు నివేదిక ఇచ్చిన ఏఎస్‌డబ్ల్యూఓ గురుప్రసాద్‌ను వెంటనే సస్పెండ్ చేయాలని కోరుతున్నారు.

మహిళపై దాడి కేసులో నిందితుడి అరెస్టు

కమలాపురం : కమలాపురం పట్టణం గిడ్డంగివీధిలో ఈ నెల 13వ తేదీన లక్ష్మీదేవి అనే మహిళపై జరిగిన దాడి కేసులో నిందితుడు ఆకుల రెడ్డి నవీన్‌ను అరెస్ట్ చేసినట్లు కడప డీఎస్పీ వెంకటేశ్వర్లు తెలిపారు. శనివారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన దాడికి సంబంధించిన వివరాలు వెల్లడించారు. నిందితుడు నవీన్ ఇంటర్ వరకు చదువుకుని ఏడాది పాటు ఏఐఎల్ డిక్సన్ కంపెనీలో పని చేసి మానేశాడు. అనంతరం క్రికెట్ బెట్టింగు, ఆన్‌లైన్ బెట్టింగ్‌లతో పాటు మద్యం తదితర వ్యసనాలకు బానిసయ్యాడు. ఈ నేపథ్యంలో అప్పులు చేసి తీర్చలేని స్థితికి చేరుకున్నాడు. తన ఇంటి పక్కనే ఉన్న కరంగుడి లక్ష్మీదేవి వద్ద తన మొబైల్‌ను కుదువ పెట్టి రూ.30వేలు అప్పు తీసుకున్నాడు. సెల్‌ఫోన్ కూడా విడిపించుకోలేక లక్ష్మీదేవిని చంపేసి ఆమె వద్ద ఉన్న సెల్‌ఫోన్‌తో పాటు ఒంటిపై ఉన్న నల్లపూసల దండ, తాళిబొట్టు సరుడులను బలవంతంగా లాక్కుని వెళ్లి వాటిని అమ్ముకుని అప్పు తీర్చాలనుకున్నాడు. దీంతో ఈ నెల 13వ తేదీ ఉదయం ఇంట్లో లక్ష్మీదేవి ఒంటిరిగా ఉన్న విషయం తెలుసుకుని, ఇంట్లోకి చొరబడి ఆమెను కత్తితో పొడిచి మెడలో ఉన్న బంగారు నల్లపూసల దండ, తాళిబొట్టు సరుడు బలవంతంగా లాక్కొని పారిపోయాడు. ఎస్పీ అశోక్ కుమార్ ఆదేశాల మేరకు కేసు నమోదు చేసిన సీఐ ఎస్‌కే రోషన్, సీసీఎస్ సీఐ భాస్కర్‌రెడ్డి, ఎస్ఐ ప్రతాప్‌రెడ్డి, సిబ్బంది తో కలసి దర్యాప్తు చేపట్టి శనివారం వల్లూరు మండలం తోళ్ల గంగన్నపల్లె వద్ద నిందితుడిని అరెస్ట్ చేశారు. అలాగే అతడి వద్ద నుంచి బంగారు తాళిబొట్టు సరుడు, నల్ల పూసల దండతో పాటు, నేరానికి ఉపయోగించిన కత్తిని స్వాధీనం చేసుకున్నారు. అనంతరం అతడిని రిమాండ్‌కు తరలిస్తున్నట్లు వివరించారు. కాగా కేవలం రెండు రోజుల్లోనే దాడి కేసులో నిందితుడుని పట్టుకుని అరెస్ట్ చేసిన సీఐ రోషన్, ఎస్ఐ ప్రతాప్ రెడ్డి, సిబ్బందిని ఆయన అభినందించారు. అలాగే వారికి రివార్డులకు సిఫార్సు చేస్తున్నట్లు తెలిపారు.



మీడియా సమావేశంలో మాట్లాడుతున్న డీఎస్పీ వెంకటేశ్వర్లు, నిందితుడితో సీఐ, ఎస్ఐ

కొనసాగుతున్న పెట్రోలు, డీజిల్ నిక్షేపాల సర్వే



లింగాల మండలంలో కొనసాగుతున్న బోరుబావుల తవ్వకాలు

లింగాల : లింగాల మండలంలో డీజిల్, పెట్రోలు నిక్షేపాలను గుర్తించేందుకు అన్వేషణ కొనసాగుతోంది. రైతులకు తెలియకుండా వారి పొలాల్లో బోర్లు వేయబోమని కాంట్రాక్టర్లు మాధవరెడ్డి, సురేష్ తెలిపారు. హైదరాబాద్‌కు చెందిన అక్షయ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ సంస్థకు లేబర్ కాంట్రాక్టు పొంది ఈ అన్వేషణలో భాగంగా లింగాల, తొండూరు మండలాల్లో బోరుబావుల తవ్వకం నిర్వహిస్తున్నామన్నారు. అయితే ఆ గ్రామాల వీఆర్‌ఓలకు, సర్పంచ్‌లకు తెలియజేసి దండోరా వేయించి రైతులకు తెలియపరుస్తామన్నారు. అయితే రైతుల బోరుబావుల సమీపంలో బోర్లు వేయడం జరగదని, బోరుకు బోరుకు మధ్య దూరాన్ని పాటించి రైతులకు ఎలాంటి హాని లేకుండా చూసుకుంటామని వీఆర్‌ఓ బాబు తెలిపారు.

ప్రొద్దుటూరులో ఆగని చోరీలు

- హౌసింగ్ బోర్డు కాలనీలో 25 తులాల బంగారు దోచుకెళ్లిన దొంగలు
- కుటుంబ సభ్యులు ఇంట్లో ఉన్నా బంగారు కొట్టేసిన అగంతకులు

ప్రొద్దుటూరు క్రైం : ప్రొద్దుటూరులో దొంగతనాలు ఆగడం లేదు. చోరీల పరంపర కొనసాగుతూనే ఉంది. నిత్యం ఏదో ఒక చోట దొంగతనాలు జరుగుతున్నాయి. ఈ నెల ఏడో తారీఖున మైదుకూరు రోడ్డులోని లక్ష్మీనగర్‌లో భారీ చోరీ జరిగిన విషయం తెలిసిందే. వస్త్రవ్యాపారి వల్లంకొండు రఘువంశీకి చెందిన 850 గ్రాముల బంగారు. 670 గ్రాముల వెండి, రూ. 7.70 లక్షలు నగదును దొంగలు దోచుకెళ్లారు. అయితే వారం రోజుల వ్యవధిలోనే హౌసింగ్‌బోర్డులో మళ్లీ చోరీ జరిగింది. ఇక్కడి గోపిరెడ్డి శివశంకర్‌రెడ్డి ఇంట్లో సుమారు 25 తులాల బంగారు నగలను దొంగలు అపహరించుకొని వెళ్లారు. పోలీసులు తెలిపిన మేరకు.. రాజుపాళెం మండలం, టంగుటూరు గ్రామానికి చెందిన శివశంకర్‌రెడ్డి వ్యవసాయదారుడు. వారి ఒక్కగానొక్క కుమార్తె సౌమ్యారెడ్డి చదువుల కోసం ప్రొద్దుటూరులోని హౌసింగ్‌బోర్డు కాలనీలో డూప్లెక్స్ ఇంటిని నిర్మించుకొని నివాసం ఉంటున్నారు. పొలం పనులు ఉన్నప్పుడు గ్రామానికి వెళ్లొస్తుంటారు. శివశంకర్‌రెడ్డి, భార్య కవిత, కుమార్తె ముగ్గురు ప్రతి రోజు మొదటి అంతస్తులోని బెడ్‌రూంలో పడుకొనేవారు. ఈ క్రమంలో శనివారం ఉదయం 5.30 గంటల సమయంలో నిద్రలేచిన వారు బెడ్‌రూం డోర్ తీయడానికి ప్రయత్నించగా రాలేదు. బయట గడియ పెట్టి ఉన్నారు. దీంతో శివశంకర్‌రెడ్డి పక్కింటి వాళ్లకు ఫోన్ చేశాడు. వాళ్లు ఇంట్లోకి వెళ్లడానికి రాగా వంట గది వైపు ఉన్న డోర్ లాక్ తొలగించి ఉంది. ఈ విషయాన్ని అతను శివశంకర్‌రెడ్డికి తెలిపాడు. చోరీ జరిగిందని భావించిన అతను వెంటనే టూ టౌన్ పోలీసులకు సమాచారం అందించారు. పోలీసుల సూచన మేరకు ఇంట్లోకి ఎవరూ వెళ్లలేదు. టూ టౌన్ సీఐ యుగంధర్, ఎస్ఐ ధనుంజయ వచ్చిన తర్వాత వారున్న బెడ్‌రూం గడియ తీశారు. తర్వాత లబోదిబో మంటూ వారంతా బయటికి వచ్చారు.

25 తులాల బంగారు చోరీ

కవిత గాబరాగా ఎదురుగా ఉన్న మరో బెడ్‌రూంలోకి వెళ్లి చూడగా బీరువా తెరచి.. అందులోని వస్తువులన్నీ చెల్లాచెదురుగా పడి ఉన్నాయి. లాకర్‌ను పరిశీలిస్తే అందులోని బంగారు నగలన్నీ కనిపించలేదు. అందులో సుమారు 25 తులాల మేర వివిధ రకాల బంగారు నగలు ఉన్నాయి. బీరువా పక్కనే ఉన్న డ్రస్సింగ్ టేబుల్‌లో తాళాలు పెట్టామని, వాటిని తీసుకొని దొంగలు బీరువా తెరిచినట్లు కుటుంబ సభ్యులు చెబుతున్నారు. కాగా వేకువ జామున 3.30 గంటల సమయంలో కింద ఏదో శబ్దం వినిపించినట్లు కవిత చెబుతున్నారు. ఎదురుగా ప్రధాన ద్వారంతో పాటు ఎడమ వైపున వంట గది పక్కన మరో ద్వారం కూడా ఇంటికి ఉన్నాయి. దొంగలు వంటగది పక్కన ఉన్న డోర్ లాక్‌ను తొలగించి సులభంగా ఇంటిపైకి ప్రవేశించారు. ముందు జాగ్రత్తగా శివశంకర్‌రెడ్డి కుటుంబ సభ్యులు నిద్రపోతున్న బెడ్‌రూంకు గడియ పెట్టి ఎదురుగా ఉన్న మరో బెడ్‌రూంలోకి దొంగలు ప్రవేశించారు. డ్రస్సింగ్ టేబుల్‌లో బీరువా తాళాలు ఉండటంతో దొంగల పని సులభతరమైంది. ఖరీదైన వడ్డానం, ఇతర ఖరీదైన బంగారు హారాలను బ్యాంక్ లాకర్‌లో పెట్టామని లేదంటే భారీ నష్టం జరిగేదని కుటుంబ సభ్యులు చెబుతున్నారు. ఘటనా స్థలంలో క్లూస్ టీం పోలీసులు వేలి ముద్రలు సేకరించారు. డాగ్ స్క్వాడ్‌తో పోలీసులు పరిశీలించారు. శివశంకర్‌రెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు టూ టౌన్ సీఐ యుగంధర్ తెలిపారు.





చోరీ జరిగిన శివశంకర్‌రెడ్డి ఇల్లు, డాగ్ స్క్వాడ్‌తో పరిశీలన

మత విద్వేషాలు రెచ్చగొడుతున్న బీజేపీ



మాట్లాడుతున్న ఆర్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి రవిశంకర్‌రెడ్డి

- రాయచోటి ఘటనకు బాధ్యులను శిక్షించాలి
- రౌండ్ టేబుల్ సమావేశంలో వక్తలు

కడప వైఎస్‌ఆర్ సర్కిల్ : బీజేపీ మత విద్వేషాలు రెచ్చగొడుతూ ప్రజల మధ్య చిచ్చు పెడుతోంది..ఇటీవల రాయచోటి ఘటనలో దాడికి పాల్పడిన వారిని ప్రభుత్వం కఠినంగా శిక్షించాలి.. అని పలు పార్టీలు, సంఘాల ప్రతినిధులు డిమాండ్ చేశారు. శనివారం స్థానిక నూర్జహాన్ కల్యాణ మండపంలో రాయలసీమ కమ్యూనిస్టు పార్టీ ఆధ్వర్యంలో మతసామరస్యం–ప్రాధాన్యత అనే అంశంపై రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ ఆర్ఎస్ఎస్ కనుసన్నల్లో నడుస్తున్న బీజేపీ ప్రభుత్వం బెంగళూరు, హైదరాబాద్, కలకత్తా, కేరళ, దక్షిణ భారతదేశంలో ముఖ్యంగా రాయలసీమ ప్రాంతంలో బలపడేందుకు ప్రయోగాలు చేస్తున్నదని తెలిపారు. ఐక్యతకు నిలయమైన రాయలసీమ ప్రాంతంలో మత చిచ్చు పెడుతున్నారని, బీజేపీ దాని అనుబంధ సంస్థలు పనిగట్టుకుని దాడులకు పూనుకుంటున్నాయన్నారు. రాయచోటిలో వీరభద్రస్వామి శోభాయాత్ర పేరిట ముస్లింలు ప్రార్థన చేసుకుంటున్న ప్రార్థనా మందిరం వైపు వెళ్లి మతాచారాలకు విరుద్ధంగా వ్యవహరించి ముస్లింలపై దాడి చేసి వారే తమపై దాడి చేశారని కేసులు పెట్టి అమాయలను జైల్లో వేశారని చెప్పారు. రాయచోటిలో వీరభద్రస్వామి యాత్ర మధ్యాహ్నం మూడు గంటలకు మసీదు దాటుకోవాలని పోలీసులు చెప్పినప్పటికీ, వారు ఉద్దేశపూర్వకంగానే సాయంత్రం 6:15 గంటలకు మసీదు వద్దకు తెచ్చారన్నారు. మసీదు ఎదుట డీజేలు, బాణసంచా కాలుస్తూ, డప్పులు, నినాదాలు చేస్తూ గొడవలు సృష్టించారని, మసీదులో ప్రార్థన చేసుకుంటున్న ముస్లిం పెద్దలపై పిల్లలపై విచక్షణారహితంగా దాడి చేసి గాయపరిచారన్నారు. ఒకప్పుడు దేశ ప్రజలందరూ కలిసి బ్రిటీష్ వారిని ఎదిరించిన గడ్డలో ప్రజల మధ్య మతాల చిచ్చుపెట్టి విడదీసే ప్రయత్నాలకు బీజేపీ ప్రభుత్వం నాంది పలికిందన్నారు. బీజేపీ చేస్తున్న వికృత చేష్టలకు ప్రజలు విసిగిపోయారని, వారు తిరగబడే రోజు అత్యంత దగ్గరలోనే ఉందన్నారు. ఈ సమావేశంలో ఆర్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి రవిశంకర్ రెడ్డి, నగర ముస్లిం ప్రముఖులు జిలాన్, అమీర్ బాబు, కాంగ్రెస్ పార్టీ నాయకులు అఫ్జల్ ఖాన్, గౌస్‌పీర్, సీఎస్ఐ టౌన్ చర్చి పాస్టర్ మోహన్ బాబు, మల్లెల భాస్కర్, సీపీఐ ఎంఎల్ లిబరేషన్ నాయకుడు ఓబయ్య, ఎన్‌ఆర్‌సీ,సీఏఏ వ్యతిరేక కమిటీ కన్వీనర్ బాబు భాయ్, సీహెచ్ శివారెడ్డి, జాకీర్, సంఘ సేవకుడు సలావుద్దీన్, రాయలసీమ మహిళా సంఘం రాష్ట్ర కార్యదర్శి తస్లీమా, గౌస్‌పీర్, ఎస్‌టీఐ తాహిర్, కార్పొరేటర్ షఫీ తదితరులు పాల్గొన్నారు.

రాజకీయ కక్షతోనే నిప్పంటించారు

పాత బస్టాండ్‌లో వైఎస్సార్‌సీపీ కార్యకర్తల షాపులు దగ్ధం

ప్రొద్దుటూరు : స్థానిక పాత బస్టాండ్‌లోని వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు అయిన కొండారెడ్డి, సుధాకర్ షాపులు దగ్ధం కావడంతో తీవ్ర నష్టం వాటిల్లింది. కేవలం రాజకీయ కక్ష సాధింపే ఈ సంఘటనకు కారణమని భావిస్తున్నారు. వైఎస్సార్‌సీపీ కార్యర్తలు కొండారెడ్డి, సుధాకర్ పాతబస్టాండ్‌లో షాపులు నిర్వహిస్తున్నారు. కొండారెడ్డి కూల్ డ్రింక్ షాపు, సుధాకర్ ఫ్యాన్సీ స్టోర్ ఏర్పాటు చేసుకుని జీవనం సాగిస్తున్నారు. ఊహించని రీతిలో శుక్రవారం అర్ధరాత్రి సమయంలో ఇరువురి దుకాణాలు దగ్ధమయ్యాయి. విషయం తెలుసుకున్న అగ్నిమాపక సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకుని మంటలను అదుపు చేశారు. పోలీసులు సంఘటన స్థలాన్ని పరిశీలించారు. ఈ నెల 12న వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో జరిగిన యువత పోరు కార్యక్రమానికి కొండారెడ్డి కార్యకర్తలతో కలసి వాహనాల్లో కడపకు వెళ్లారు. ఈ కారణంగానే వీరి షాపులకు నిప్పు అంటించారని తెలుస్తోంది. శనివారం మున్సిపల్ వైస్ చైర్మన్లు ఆయిల్ మిల్ ఖాజా, పాతకోట బంగారు మునిరెడ్డి సంఘటన స్థలాన్ని పరిశీలించారు. వైఎస్సార్‌సీపీ పట్టణాధ్యక్షుడు భూమిరెడ్డి వంశీధర్‌రెడ్డి, కౌన్సిలర్ చింపిరి అనిల్ కుమార్, నియోజకవర్గ యువజన విభాగం అధ్యక్షుడు ద్వార్శల గురునాథ్‌రెడ్డి పాల్గొన్నారు.



బాధితులను పరామర్శిస్తున్న మున్సిపల్ వైస్ చైర్మన్లు ఖాజా, పాతకోట బంగారు మునిరెడ్డి

గడ్డివామి దగ్ధం



దగ్ధం అవుతున్న గడ్డివామి

బ్రహ్మంగారిమఠం : బి.మఠం –బద్వేలు రోడ్డులో నరసింహస్వామి ఆశ్రమం దగ్గర ఉన్న గోశాలలో శనివారం తెల్లవారు జామున గడ్డి వామికి గుర్తుతెలియని వ్యక్తులు నిప్పు పెట్టారు. అంతకు ముందు రోజు గోశాలకు సమీపంలో ఉన్న నివాసముంటున్న వారికి గోశాల నిర్వాహకులకు మధ్య స్వల్ప ఘర్షణ జరిగిందని స్థానికులు తెలుపుతున్నారు. గడ్డి వామి దగ్ధంపై పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు గోశాల నిర్వాహకులు తెలిపారు.

ఏఆర్ ఎస్ఐ సస్పెన్షన్

కడప అర్బన్ : కడపలోని పోలీస్ శాఖలో ఆర్మ్‌డ్ రిజర్వ్ విభాగంలో ఎస్ఐగా పనిచేస్తున్న ఐవీ రమణారెడ్డి (1824)ని సస్పెండ్ చేస్తూ కర్నూలు రేంజ్ డీఐజీ డాక్టర్ కోయప్రవీణ్ ఇటీవల ఉత్తర్వులు జారీ చేశారు. ఆయన పోలీసు శాఖలో ఉద్యోగాలు ఇప్పిస్తామని చెప్పి చాలామంది నిరుద్యోగ యువత వద్ద లక్షలాది రూపాయలను వసూలు చేసుకున్నారు. దీంతో బాధితులు పోలీసు ఉన్నతాధికారులకు గతంలోనే ఫిర్యాదు చేశారు. వారి ప్రాథమిక నివేదిక మేరకు కర్నూలు డీఐజీ ఆదేశించారు.

బ్యాంకు ఖాతా నుంచి రూ.4.89 లక్షలు కాజేశారు

బి.కొత్తకోట : గుర్తు తెలియని వ్యక్తి నుంచి మొబైల్‌కు వచ్చిన మేసేజ్ ఓపెన్ చేయగానే రూ.4.89 లక్షలు కాజేశారని బాధితుడు ఇచ్చిన ఫిర్యాదుపై కేసు నమోదు చేసినట్లు శనివారం పోలీసులు తెలిపారు. మండలంలోని నాయనబావికి చెందిన దాదం లోకనాథరెడ్డి మొబైల్‌కు గతనెల 14న ఓ మెసేజ్ వచ్చింది. దాన్ని చూసిన లోకనాథరెడ్డి క్లిక్ చేసి తెరిచాడు. గట్టు కెనరా బ్యాంకు ఖాతా నుంచి విడతల వారీగా రూ.4,89,858 నగదు వేరే ఖాతాలకు బదిలీ అయిపోయింది.